క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు బొకే ఇచ్చి సన్మానిస్తున్న యూసుఫ్ ఖాద్రీ

పహాడీషరీఫ్: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ యూసుఫ్ ఖాద్రీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీ నేతకు పీసీసీ అధ్యక్ష పదవి దక్కడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు హంజా, వసీం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీవో శైలజ



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శైలజ

మహేశ్వరం: హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌ను ఆమె సందర్శించి కిచెన్, వంట సామగ్రి, కూరగాయలు, వడ్డించిన భోజనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినాలని ఆమె సూచించారు. అంతకుముందు వంట శాలను ఆమె పరిశీలించి విద్యార్థులకు వండుతున్న కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించి, వండిన భోజనాన్ని ఆమె రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పలువురు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 2 లక్షల ప్రొసిడింగ్‌ను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అందజేసినట్లు ఏపీఎం శ్రీదేవి తెలిపారు. మహిళా సమాఖ్య భవనంలో టాయిలెట్స్ లేకపోవడంతో గత మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీంతో టాయిలెట్స్ నిర్మాణానికి మంజూరైన నిధుల ప్రొసిడింగ్‌ను మంగళవారం ఉప్పల వెంకటేశ్ అందజేశారని ఆమె చెప్పారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 25, వంకాయ రూ.50, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ. 23-40, కాకర రూ. 38, బీర రూ. 55, క్యాబేజీ రూ.15, ఫ్రెంచి బీన్స్ రూ. 80, క్యారెట్ రూ.60, దొండ రూ.40-50, చిక్కుడు రూ.95, గోకర రూ.50, బీట్‌రూట్ రూ.28, క్యాప్సికం రూ.60, ఆలు రూ.38, దోస రూ. 23, సొర రూ.17, పొట్ల రూ.23, ఉల్లిగడ్డ రూ.54, చామగడ్డ రూ. 45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వీరవనిత చాకలి ఐలమ్మ



మహేశ్వరం: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహేశ్వరం: తెలంగాణలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం మండల అధ్యక్షుడు బజార్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహేశ్వరం పట్టణ శాఖ రజక సంఘం అధ్యక్షుడు గొల్కొండ శంకర్ ఆధ్యక్షతన వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గరీబు కులంలో జన్మించి నైజాం దొరను వణికించిన ఘనత ఐలమ్మకే దక్కుతుందన్నారు. భూమి, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటం సమజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అందరూ చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, మాజీ శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, సీపీఐ జిల్లా నాయకులు దత్తు నాయక్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, బీఎస్పీ సీనియర్ నాయకుడు కటికెల శ్రీహరి, మాజీ ఉపసర్పంచ్ కర్రోళ్ల రాములు, రజక సంఘం నాయకులు సత్తయ్య, సురేశ్, కృష్ణ, సుధాకర్, చింటు పలువురు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి

మీర్‌పేట: భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపిందని మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ తెలిపారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చందన చెరువు కట్టపై ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట పటిమ, వీరత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంగి కరుణానిధి, బీజేపీ ప్రధాన కార్యదర్శి గాజుల మధు, సత్యనారాయణ, భిక్షపతి రజక, రామకృష్ణ రజక, మల్లేశ్, బాల్‌రాజ్, అంజయ్య, చంద్రయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలో రజకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజకాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, సోమరాజు వెంకటేశ్, కిషన్, సురేందర్, మల్లేశ్, కృష్ణ, నర్సింహ, రమేష్, జనార్దన్, సత్తయ్య, వెంకటేశ్, నరేశ్, గణేశ్, బాల్‌రాజ్, బాలకృష్ణ, రమేష్, శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.



మీర్‌పేట: చందన చెరువుపై నివాళులర్పిస్తున్న పెండ్యాల నర్సింహ తదితరులు



కందుకూరు: చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం

బాధిత కుటుంబానికి సాయం



కడ్తాల్: ఆర్థిక సాయం అందజేసిన శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన రాజయ్య మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, బోసు వెంకటేశ్, వడ్డెరాజు, క్యామ రాజేశ్, శేఖర్, మహేశ్, రాఘవేందర్, శివలింగం, హరీశ్, పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, లష్కర్‌గూడ గ్రామానికి చెందిన కొండూరి కిషన్ జులైలో మృతి చెందడంతో సహకార సంఘం తరఫున మృతుడి కుటుంబ సభ్యులకు సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు. డైరెక్టర్లు బిజిలీ బాలనర్సింహ, ఇటుకల మహేందర్‌రెడ్డి, మేకల రాములు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

మహేశ్వరం నియోజకవర్గంతో పాటు అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆయా గణపతి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో పాటు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గణనాథుడికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించి తమ పనులకు విఘ్నాలు కలగకుండా చూడు స్వామి అంటూ వేడుకున్నారు.



హుడాకాంప్లెక్స్: పీవీటీ మార్కెట్‌లోని గణనాథుని పూజలో కైరంకొండ ధనుంజయనేత, బేర బాలకిషన్, తదితరులు



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గుండు నర్సింగ్

నిమజ్జనానికి ఏర్పాట్లు షురూ!



రావిర్యాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు



మహేశ్వరం: నిమజ్జనం చేయడానికి కొత్వాల్ చెరువును పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

తుక్కుగూడ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని రావిర్యాల చెరువు, తుక్కుగూడ సూరం చెరువు వద్ద మున్సిపల్ అధికారులు నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా 5, 7, 9, 11 రోజుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు చెరువుల వద్ద అధికారులు క్రేన్లు, విద్యుత్ లైట్లు, భారీకేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు చెరువుల్లో భారీగా గణపతులు ప్రతి ఏడాది నిమజ్జనం కానున్నాయి. రావిర్యాల చెరువు వద్ద ఆదిబట్ల పోలీసులు, తుక్కుగూడ సూరం చెరువు వద్ద పహాడీషరీఫ్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేస్తారు. మంగళవారం నిమజ్జనం పనులను తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మల్లేశం, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి

మహేశ్వరం: మండలంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కేసీ తండాలోని కొత్వాల్ చెరువు, అమీర్‌పేట్ చెరువులను ఆయన ఎంపీడీఓతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం చేసేందుకు మండలంలో ఉన్న ప్రధాన చెరువులు, కుంటల వద్ద క్రేన్స్, లైటింగ్, సీసీ కెమెరాలు, రోడ్డు సౌకర్యం వంటి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అంతకుముందు కేసీ తండాలోని కొత్వాల్ చెరువును ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంధ్యా నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దావ ప్రతాప్, మున్సిపాలిటీ కౌన్సిలర్ కమటం రాధమ్మ, స్థానిక నాయకులు వెంకటయ్య, దావ దనుంజయ, శ్రీపాల్, అనంతరాములు, యాదగిరి, రవి కుమార్, రవీందర్, నర్సింహ, మహేశ్, శ్రీకాంత్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం: చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి కలిగిన క్రీడలను నేర్చుకుంటేనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. నేటి క్రీడాకారులందరూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. వివిధ పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పలు కాలనీలలో స్ట్రీట్‌లైట్లు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో హరిందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, యాదవరెడ్డి, నవీన్, సతీష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ట్రిబుల్ 'ఆర్' గుబుల్!

- ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే
- మండలంలోని పలు గ్రామాల్లో మార్కింగ్
- ఆందోళనలో రైతులు



కర్కాస్ తండాలో ట్రిబుల్ ఆర్ మార్కింగ్‌ను చూస్తున్న రైతులు

తలకొండపల్లి: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణ పనులకు సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. రోడ్డు మ్యాపును అనుసరించి ఓ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు మార్కింగ్ చేస్తున్నారు. ఈ ట్రిబుల్ ఆర్ రహదారి నల్గొండ జిల్లా నుంచి ప్రారంభమై ఆమనగల్లు మండలం చింతలపల్లి మీదుగా గొరిపల్లి, ఖానాపూర్, కర్కాస్ తండా, బద్నాపూర్ శివారు ప్రాంతాల్లోని పొలాల మీదుగా కేశంపేట్ మండలం నిర్దవెల్లి, కాకునూర్, గ్రామాలతో పాటు, షాద్‌నగర్ మీదుగా వెళ్తుంది. సంబంధిత సర్వే కంపెనీ మార్కింగ్ చేయడంతో ఆ గ్రామాల ప్రజల గుండెల్లో గుబుల్ పెరుగుతోంది. మండలంలోని గొరిపల్లి, ఖానాపూర్, కర్కాస్ తండా, బద్నాపూర్ గ్రామాల వ్యవసాయ పొలాల్లో ట్రిబుల్ ఆర్ మార్కింగ్ చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు దీని గురించే తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మార్కింగ్ చేసిన పొలాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తమకున్న రెండు, మూడు ఎకరాల పొలం పోతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎలా బతకాలని కొందరు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తమ పొలాల మీదుగా ట్రిబుల్ ఆర్ చేపడితే, ఉన్న జీవనాధారం కాస్త దూరమవుతుందని అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలో ట్రిబుల్ ఆర్ రహదారికి తీసుకుంటున్న పొలాల ధర సుమారు ఎకరం రూ. 80 లక్షల నుంచి రూ. కోటి వరకూ పలుకుతుంది. అలాంటప్పుడు తమ పొలాల నుంచి ట్రిబుల్ నిర్మాణం చేపడితే ప్రభుత్వం అంత ధర చెల్లిస్తుందో లేదోనని కొందరు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ట్రిబుల్ ఆర్ మార్కింగ్ రైతుల మొఖాల్లో ఆనందం కనిపించడం లేదు.

భూములకు డిమాండ్

మండలంలోని ఆయా గ్రామాల మీదుగా ట్రిబుల్ ఆర్ నిర్మాణం చేపడుతుండడంతో భూముల ధరలు అమాంతం పెరిగి రియల్ వ్యాపారం పుంజుకోనుంది. ఈ విషయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ చేసిన రైతులకు నష్టాలు సంభవించగా, రియల్ వ్యాపారులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్కింగ్ చేసిన సమీప పొలాల రైతులు సంతోషంతో మునిగి తేలుతున్నారు. భవిష్యత్‌లో తమ పొలాలకు అధిక ధర పలకడమే కాకా డిమాండ్ పెరుగుతుందని చెప్పుకుంటున్నారు. ప్రస్తుత ధర ఎకరం రూ. కోటి ఉంటే, రాబోవు రోజుల్లో అదే పొలానికి రూ. రెండు నుంచి రూ. 5 కోట్లకు పెరగొచ్చని ఆనందంవ్యక్తం చేస్తున్నారు.

భూమి ఇప్పించాలి



నాకు 30 గుంటల పొలం ఉంది. ఆ పొలం నుంచి ట్రిబుల్ ఆర్ నిర్మాణం చేయనున్నట్లు మార్కింగ్ వేశారు. ఉన్న భూమి పోతే ఏ పని చేసుకొని బ్రతకాలి. ప్రస్తుతం వ్యవసాయమే జీవనాధారంగా ఉంది. కాబట్టి రహదారి నిర్మాణానికి ఎంత భూమి పోతే అంతే విలువ గల భూమిని మరోచోట ఇప్పించాలి.

- తిర్మణి మల్లేశ్, రైతు, జంగారెడ్డిపల్లి

రైతులకు మేలు చేయాలి



భూములు కోల్పోయి జీవనోపాధి కోల్పోతున్నాం. ట్రిబుల్ ఆర్ నిర్మాణంతో నాకున్న 6 ఎకరాల్లో అర ఎకరం పోతుంది. మార్కెట్లో ఎకరా భూమి రూ. కోటి పలుకుతుంది. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకొని మేలు చేయాలి

- శ్రీనివాస్, రైతు, జంగారెడ్డిపల్లి

భూమికి.. భూమి పరిహారం..



ట్రిబుల్ ఆర్ నిర్మాణం మా పాలిట శాపంగా మారింది. నాకున్న 30 గుంటల భూమి ట్రిబుల్ ఆర్ నిర్మాణంలో పోతుంది. దీంతో భూమి కోల్పోయి ఎలా బ్రతకాలి. జీవనోపాధి ప్రశ్నార్థకం కానుంది. బ్రతుకు దెరువు వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. మార్కెట్‌లో ఎకరా భూమి సుమారు రూ. కోటి పలుకుతుంది. ప్రభుత్వం భూమి కోల్పోయే వారికి భూమి పరిహారంగా ఇస్తే బాగుంటుంది.

- యాదయ్య గౌడ్, రైతు, జంగారెడ్డిపల్లి

భౌతిక శాస్త్రంలో వంశీబాబుకు డాక్టరేట్



వంశీబాబు

ఇబ్రహీంపట్నం: భౌతిక శాస్త్ర విభాగంలో చేసిన పరిశోధనలకుగాను ఇబ్రహీంపట్నానికి చెందిన కొండ్రు వంశీబాబుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. భౌతిక శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి ఉపేందర్ పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ అల్కలీ మెటలాక్సైడ్ ఆన్ స్ట్రక్చర్ డిపెండెంట్ ప్రాపర్టీస్ ఆఫ్ బోరో-టెల్యూరైట్ గ్లాసెస్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. వాటిని పరిశీలించి ఉస్మానియా విశ్వవిద్యాలయం వంశీబాబుకు డాక్టరేట్ ప్రకటించింది. త్వరలో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ డాక్టరేట్ అందజేయనున్నారు. ఈ సందర్భంగా వంశీబాబు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి, గవర్నమెంట్ సిటీ కాలేజీలో డిగ్రీ, నిజాం కళాశాలలో పీజీ పూర్తి చేశానన్నారు. తన తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గౌరవ డాక్టరేట్ సాధించానన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ఇబ్రహీంపట్నం: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాఠశాల పీఈటీ సుశీల తెలిపారు. అండర్ 14 విద్యార్థులకు బుధవారం, అండర్ 17 వారికి గురువారం పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.